నేడు డయల్ యువర్ డీఎం

చందానగర్: డయల్ యువర్ డీఎం కార్యక్రమంను నేడు ఆర్టీసీ మియాపూర్-2 డిపోలో ఉంటుందని డిపో మేనేజర్ వెంకటేశం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. డిపో పరిధిలోని మియాపూర్, బాచుపల్లి, మల్లంపేట్‌తో పాటుగా నిజాంపేట్ పరిసర ప్రాంతాల ప్రజలు ఆర్టీసీ బస్సు సేవలకు సంబంధించి తెలియజేయవచ్చన్నారు. సమస్యలతో పాటుగా సూచనలు సలహాలు తెలుపవచ్చన్నారు. ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు 9959226420 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ ప్రయాణికులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

హెచ్‌సీయూలో క్లీనప్ డ్రైవ్



రాయదుర్గం: హెచ్‌సీయూ క్యాంపస్‌ను శుభ్రంగా, ఆహ్లాదకరంగా మార్చడమే లక్ష్యంగా ఎన్ఎస్ఎస్ పనిచేస్తుందని హెచ్‌సీయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ బి కృష్ణయ్య తెలిపారు. శనివారం హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్‌లో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో క్లీనప్ డ్రైవ్ కార్యక్రమాన్ని హార్టికల్చర్, పారిశుద్ధ్య విభాగాల సమన్వయంతో నిర్వహించారు. వలంటీర్లు వ్యర్థాలను తొలగించి ట్రాక్టర్ ద్వారా డంపింగ్ యార్డ్‌కు తరలించారు.

లయన్స్ క్లబ్ చేయూత



చందానగర్: చందానగర్‌లోని హోప్ ఫౌండేషన్ కార్యాలయంలో 10వ తరగతి విద్యార్థి కార్తీక్‌కు శనివారం రూ.25వేల చెక్కును చైర్మన్ కొండ విజయ్‌కుమార్ అందించారు. ఈ సందర్భంగా విద్యార్థి తల్లిదండ్రులు ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ డిస్ట్రిక్ట్ కేబినెట్ సెక్రటరీ లయన్ శ్రీధర్, రీజియన్ అధ్యక్షులు కరుణాకర్‌గౌడ్, లయన్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

టౌన్ వెండింగ్ కమిటీ సమావేశం



మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ ముకుంద్‌రెడ్డి తదితరులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయంలో టౌన్ వెండింగ్ కమిటీ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ ముకుంద్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గఫూర్‌నగర్‌లో స్ట్రీట్ వెండర్స్‌కు కేటాయించేందుకు అవసరమైన స్థలాన్ని ఎంపిక చేసేందుకు పరిశీలించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో ఈఈ దుర్గా ప్రసాద్, ఏసీపీ వెంకటరమణ, ఏఎంసీ ప్రేమ్‌కుమార్, ఉప వైద్యాధికారి శ్రీకాంత్‌రెడ్డి, ప్రాజెక్టు ఆఫీసర్ మల్లీశ్వరి, సీఓ శ్రీకాంత్, మాదాపూర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, అడిషినల్ ఇన్‌స్పెక్టర్ అన్నిరెడ్డి, ఎస్ఐ వీరభద్రం, నల్లగండ్ల మార్కెట్ కమిటీ అధ్యక్షులు డి.వీరేశం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బెట్టింగ్‌కు పాల్పడుతున్న ముఠా అరెస్ట్

రూ.53 వేలు, 5 సెల్‌ఫోన్‌లు, ఒక కారు, 20.66 లక్షలు ఆన్‌లైన్ బ్యాలెన్స్ సీజ్

చందానగర్: బెట్టింగ్‌యాప్స్‌తో క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ముఠాను శనివారం మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు అరెస్ట్ చేశారు. మియాపూర్ సీఐ క్రాంతి కిరణ్ తెలిపిన ప్రకారం వివరాలు...మియాపూర్‌కు చెందిన మాదిశెట్టి అజయ్ (46), రాజస్థాన్‌కు చెందిన జీత్ శర్మ (30), మియాపూర్‌కు చెందిన మాదిశెట్టి సంధ్య (40), బాసిబోయిన సుమంత్ (28), బీర గణేష్‌కుమార్ (31)లు కలిసి క్రికెట్ యాప్స్ క్రిక్ 24/7, నైస్ 7777, యోప్ 2020లతో మియాపూర్ న్యూహఫీజ్‌పేట్‌లోని మార్తాండనగర్‌లో గుట్టు చప్పుడు కాకుండా బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నారు. విశ్వసనీయ సమాచారంతో మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు మియాపూర్ న్యూహఫీజ్‌పేట్‌లో వారి నివాసంపై దాడి చేశారు. అక్కడే ఉన్న 5 మందిని అదుపులోకి తీసుకొని మియాపూర్ పోలీసులకు అప్పగించారు. వారి వద్ద నుంచి రూ.53వేల నగదు, 5 సెల్‌ఫోన్లు, హుందాయ్ ఐ20 కారు, ఆన్‌లైన్ అకౌంట్ బ్యాలెన్స్ రూ.20,60,603లు సీజ్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మరో ఇద్దరు నిందితులైన సురేష్ గవల, మాదిశెట్టి కరలు పరారీలో ఉన్నారన్నారు. త్వరలోనే వారిని కూడా పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

నేటి నుంచి గోపన్‌పల్లి రంగనాథస్వామి ఉత్సవాలు

450 ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయం

ఏటా ఉగాది సందర్భంగా రెండురోజుల పాటు వేడుకలు



రంగనాథస్వామి



గోపన్‌పల్లిలోని రంగనాథస్వామి ఆలయ ప్రాంగణం

రాయదుర్గం: గోపన్‌పల్లి రంగనాథస్వామి ఆలయానికి 450 ఏళ్ల చరిత్ర ఉంది. రెండు భారీ బండరాళ్ల కింద ఉన్న ఆలయంలో ఏటా రెండు రోజులు మాత్రమే భారీ ఉత్స వాలు జరుగుతాయి. ఉగాది పండగను పురస్కరించుకుని రెండు రోజుల ఉత్సవాలను నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు.

◆ రంగనాథస్వామి ఆలయానికి 27 ఎకరాల భూమి ఉంది. కోట్లాది రూపాయల విలువ చేసే ఈ భూములను కాపాడాలని భక్తులు ఏటా దేవాదాయశాఖకు విన్నవిస్తుంటారు. గర్భాలయంలో రాతిపైనే పడుకున్నట్లు రంగనాథ స్వామి మూలవిరాట్టు ఉంటుంది.

మొదటిరోజు రథోత్సవం..
మరుసటి రోజు పంచాంగ పఠనం

గోపన్‌పల్లిలోని రంగనాథస్వామి ఆలయంలో ఉత్సవాలలో మొదటిరోజు ఆదివారం ఉదయం 8 గంటలకు మహా అభిషేకం, 9 గంటలకు స్వామి వారి ఆభరణాల ఊరేగింపు, 10.20 గంటలకు అలంకరణ, 12.30 గంటలకు నేవైద్యం సాయంత్రం 6 గంటలకు దీపారాధనోత్సవం, రాత్రి 8 గంటలకు రథోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. రెండవరోజు సోమవారం ఉదయం 6 గంటలకు అవభృత స్నాన కార్యక్రమం, 8.30 గంటలకు ఆలయ అర్చకులు పంచాంగ పఠనం చేస్తారు. కాగా ఉగాది రోజు సాయంత్రం అన్ని ఆలయాల్లో పంచాంగ పఠనం ఉండగా శతాబ్దాలుగా ఇక్కడ మాత్రం ఉగాది మరుసటి రోజు నిర్వహించడం ప్రత్యేకత. కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు రవీంద్రప్రసాద్ దూబే, ఆలయ అర్చకులు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

గోపన్‌పల్లివాసుల ఆరాధ్యదైవం



రంగనాథస్వామి గోపన్‌పల్లి ప్రజల ఆరాధ్యదైవం. ఆలయంలో పూజ చేసిన తర్వాతే ఏపనైనా చేస్తాం. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని రెండు రోజులపాటు గోపన్‌పల్లి, చుట్టుపక్కల ప్రాంతాల వారు పండుగ చేసుకుంటారు.

– గంగాధర్‌రెడ్డి, కార్పొరేటర్, గోపన్‌పల్లి

ఇఫ్తార్ విందు

చందానగర్: రంజాన్‌ను పురస్కరించుకుని శనివారం మాదాపూర్ డివిజన్ ఆదిత్యనగర్‌లోని సెయింట్ ఇసాక్ అడ్వాంట్ హైస్కూల్‌లో ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే గాంధీ హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఐజాక్, కమర్ జహన్, సీనియర్ నాయకులు శ్రీనివాస్ యాదవ్, సాంబశివరావు, ఖాసీం, అక్కారవు, బృందరావు, సత్యం గుప్తా తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

పటాన్‌చెరు టౌన్: వేసవిలో చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ అన్నారు. శనివారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలో పోలీస్‌స్టేషన్ సమీపంలో యువజన వికాస్ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కార్పొరేటర్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అశోక్ కుమార్, యువజన వికాస సమితి అధ్యక్షులు విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి విజయ్‌గౌడ్, ఉపాధ్యక్షులు సతీష్‌కుమార్, సహాయ కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి షణ్ముఖ, కార్యవర్గ సభ్యులు వెంకటేష్ గౌడ్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులను కాపాడతాం: ఎమ్మెల్యే గాంధీ



మక్తమహబూబ్‌పేట్ చెరువు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

చందానగర్: హఫీజ్‌పేట్, మియాపూర్ డివిజన్ల పరిధిలోని కాయిదమ్మకుంట, మక్తమహబూబ్ పేట్ చెరువులను సుందరీకరిస్తున్నామని ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. శనివారం హఫీజ్‌పేట్, మియాపూర్ డివిజన్ల పరిధిలోని కాయిదమ్మకుంట, మక్తా చెరువుల సుందరీకరణలో భాగంగా నెక్సస్ సెలెక్ట్ మాల్స్ వారి సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా మల్లిగవాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చెరువు పునరుద్ధరణ పనులను కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువులను సంరక్షిస్తామన్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో ఐటి సంస్థ ప్రతినిధులు చైతన్య, రాము, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అలరించిన అన్నమయ్య కీర్తనలు



మాదాపూర్: కళాకారులు అన్నమాచార్య కీర్తనలను ఆలపించి సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో శనివారం నిర్వహించే అన్నమయ్య స్వరార్చన కార్యక్రమంలో భాగంగా సుమంగళి శిష్యబృందం అన్నమయ్య కీర్తనలను ఆలపించారు. గోవింద గోవింద, రామచంద్రుడితడు, తిరువీధుల మెరిసి, నిగమా నిగమాంత అంటు కళాకారులు అక్షత, శ్రీనిధి, తేజస్వి, వైష్ణవి మారోజు, గ్రీష్మ, వైష్ణవి, అభిషేక్, శౌర్యచంద్రలు ఆలపించారు. వీరికి కీబోర్డు సత్యదేవ్, తబలా భూమేష్ సంగీత వాయిద్య సహకారాన్ని అందించారు. సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ శోభారాజు కళాకారులకు జ్ఞాపికలను అందజేశారు.

మార్కెట్‌పై అవగాహన కలిగి ఉండాలి



శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న భుజంగరావు

మాదాపూర్: వ్యాపార రంగంలో రాణించాలంటే సాంకేతిక పరిజ్ఞానంతో పాటు మార్కెట్‌పై అవగాహన కలిగి ఉండాలని అగ్రి రిటైర్డ్ లీడ్ జిల్లా మేనేజర్ భుజంగరావు అన్నారు. మాదాపూర్‌లోని నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్‌లో 45 రోజుల పాటు నిర్వహించిన వ్యవసాయ ఉపాధి శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకుల నుంచి సబ్సిడీ రుణాలను తీసుకోవాలనుకుంటే నిర్ధిష్టమైన, ప్రణాళిక బద్ధంగా ప్రాజెక్టులను బ్యాంకులకు అందజేయాలన్నారు. ఎప్పటి కప్పుడు మార్కెట్‌పై అవగాహన కలిగివుండాలన్నారు. ఎంచుకునే రంగం పది మందికి ఉపయోగపడేలా, ఉద్యోగావకాశాలు కలిపించేలా ఉండాలన్నారు.ఏఏ రంగాలలో భవిష్యత్తు బాగుంటుందో వివరించారు. అనంతరం రాష్ట్రంలో వివిధ జిల్లాలకు చెందిన 25 మందికి సర్టిఫికెట్‌లను అందజేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కో ఆర్డినేటర్ రాణి, కోవె (కాన్ఫిడరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా) ప్రాజెక్టు మేనేజర్ శాంతి, ఫ్యాకల్టీ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వవిద్యాలయాల మేళా

శేరిలింగంపల్లి: విశ్వవిద్యాలయాల మేళా.. గ్లోబల్ విద్య భాగస్వామ్యానికి మైలురాయి వంటిదని ఎపిస్టెమో వికాస్ లీడర్‌షిప్ స్కూల్ ప్రిన్సిపాల్ పద్మ కొల్లి పేర్కొన్నారు. శేరిలింగంపల్లిలోని ఎపిస్టెమో వికాస్ లీడర్‌షిప్ స్కూల్‌లో శనివారం విశ్వవిద్యాలయ మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో పద్మ మాట్లాడుతూ భారతదేశంలోని విశ్వవిద్యాలయాలే కాకుండా విదేశాలకు చెందిన 85 ప్రముఖ విశ్వవిద్యాలయాలు పాల్గొన్నాయని వివరించారు. అమెరికా, ఇంగ్లాండ్, కెనడా, ఆస్ట్రేలియా ఇటలీ, ఫ్రాన్స్, దుబాయి టర్కీ, వెస్టిండీస్, సింగపూర్, స్విట్జర్లాండ్, జపాన్ దేశాల నుంచి విశ్వవిద్యాలయాలు ఈ మేళాలో పాల్గొన్నాయని వివరించారు. 7 విశ్వవిద్యాలయాలతో ఎపిస్టెమో స్కూల్ ఒప్పందం కుదుర్చుకుంది. కార్యక్రమంలో స్కూల్ కౌన్సిలింగ్ ఇంచార్జ్ రజిత, వైస్ ప్రిన్సిపాల్ వాణి మ్రి, ఉపాధ్యాయులు, వివిధ యూనివర్శిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.



మేళాలో పాల్గొన్న విద్యార్థులు

12 మంది సెక్స్‌వర్కర్లు అరెస్ట్

రాయదుర్గం: సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 12 మంది సెక్స్ వర్కర్లను అరెస్ట్ చేసి వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. సైబరాబాద్‌లోని యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్స్ (ఏహెచ్‌టీయూ) డీసీపీ, డబ్ల్యూ అండ్ సీఎస్‌డబ్ల్యూ పర్యవేక్షణలో కేపీహెచ్‌బీ మెట్రో స్టేషన్ పరిధిలోని భాగ్యనగర్ బస్టాప్ వద్ద, కూకట్‌పల్లి, మాదాపూర్ ప్రాంతాలలో నిర్వహించిన ఆపరేషన్‌లో వీరిని అరెస్ట్‌చేశారు. కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, గచ్చిబౌలి పోలీస్ స్టేషన్లలో అనైతిక (నివారణ) చట్టం1956 కింద కేసులు నమోదు చేశారు. అనంతరం వారికి సైబరాబాద్ అధికారులు కౌన్సిలింగ్ ఇచ్చి బైండోవర్ చేశారు.

అన్నదానం

మణికొండ: అలకాపూర్ టౌన్‌షిప్‌లో శనివారం అమావాస్య సందర్భంగా పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. మణికొండ వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు యాదగిరి మాట్లాడుతూ... ప్రతి నెల అమావాస్య రోజు క్రమం తప్పకుండా అన్నదానం చేస్తున్నామన్నారు.



స్పోర్ట్స్ హబ్‌గా హైదరాబాద్

● ఆసియా కరాటే చాంపియన్‌షిప్ 2027 హైదరాబాద్‌లోనే..

● టీపీసీసీ అధ్యక్షుడు, కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్



విజేతలకు బహుమతులు అందించిన పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

గచ్చిబౌలి: హైదరాబాద్ నగరాన్ని స్పోర్ట్స్ హబ్‌గా మారుస్తున్నామని, సీఎం ప్రత్యేక చొరవతో అందుకు అడుగులు పడుతున్నాయని టీపీసీసీ అధ్యక్షుడు, కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని జీఎంసీబాలయోగి స్టేడియంలో నాలుగు రోజుల పాటు సాగిన కరాటే పోటీలు ముగిశాయి, ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2027 లో ఆసియా కరాటే చాంపియన్‌షిప్ పోటీలు హైదరాబాద్ నగరంలో జరుగుతాయని స్పష్టం చేశారు. ఈ పోటీలలో ఓవరాల్ చాంపియన్స్‌గా ఢిల్లీ, మధ్యప్రదేశ్, హర్యానా జట్లు నిలిచాయి. ఈ పోటీలలో 28 రాష్ట్రాలతో పాటు ఆర్మీ పారా మిలటరీ విభాగాలకు చెందిన 36 జట్లు పాల్గొన్నాయి. కాగా ఈ పోటీల ముగింపు సమావేశానికి సీఎం రేవంత్‌రెడ్డి సందేశాన్ని పంపించారు. ఈ కార్యక్రమంలో శాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి, ఎండీ సోనిబాల, కరాటే ఇండియా అధ్యక్షుడు భారత్‌శర్మ, నిర్వాహకులు కీర్తన్, రామస్వామి పాల్గొన్నారు.

దేశాభివృద్ధికి వన్ నేషన్- వన్ ఎలక్షన్ అవసరం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్

చందానగర్: దేశాభివృద్ధికి వన్ నేషన్ వన్ ఎలక్షన్ ఎంతో అవసరమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ పేర్కొన్నారు. శనివారం వన్ నేషన్ వన్ ఎలక్షన్ కన్వీనర్ బాల్దా అశోక్ సమక్షంలో మియాపూర్ డివిజన్ పరిధిలోని మయూరినగర్, వీడియో కాలనీ, జేపినగర్, డోవా కాలనీల సంక్షేమ సంఘ అధ్యక్షులు, సభ్యులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ స్వీడన్, దక్షిణాఫ్రికా, యూఎస్ఏ తదితర దేశాలలో ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తారని వివరించారు. ఈ విధానంలో మొదటి దశలో లోక్‌సభ, అసెంబ్లీల ఎన్నికలు నిర్వహించిన తర్వాత 100 రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందన్నారు. దీనికోసం రాజ్యాంగ సవరణలు అవసరమన్నారు. శక్తివంతమైన దేశంగా తీర్చిదిద్దటమే ప్రధాని మోదీ ధ్యేయమన్నారు. ప్రతి కాలనీ, బస్తీలలో వన్ నేషన్ వన్ ఎలక్షన్‌పై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఓబీసీ జిల్లా అధ్యక్షులు నాగేశ్వర్‌గౌడ్, మియాపూర్ డివిజన్ అధ్యక్షులు ఆకుల లక్ష్మణ్, సీనియర్ నాయకులు మనోహర్, మాణిక్ రావు, వెంకటస్వామి రెడ్డి, గణేష్, కిరణ్‌కుమార్ రెడ్డి, ప్రభాకర్ రావు, వివిధ కాలనీల సంక్షేమ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

టీ9 ఛాలెంజ్ గోల్ఫ్ విజేత బంకర్ బస్టర్స్



సాక్షి, సిటీబ్యూరో: గోల్ఫ్ క్రీడను ప్రోత్సహించే ఉద్దేశంతో టీగోల్ఫ్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న ఆరో రియాల్టీ టీ9 ఛాలెంజ్ మూడో సీజన్లో బంకర్ బస్టర్స్ టీమ్ ఛాంపియన్గా నిలిచింది. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్లో బంకర్ బస్టర్స్ , ట్యుటోరూట్స్ విజయం సాధించింది. ఊహించని విధంగా ఫైనల్ మ్యాచ్ కూడా టై అయింది. దీంతో ఫలితం కోసం ప్లే ఆఫ్ నిర్వహించగా.. అక్కడ కూడా స్కోర్ సమమైంది. చివరిగా సడన్ డెత్ హోల్లో బంకర్ బస్టర్స్ పైచేయి సాధించి ట్రోఫీని కై వసం చేసుకుంది. ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్గా మోస్ట్ వాల్యుబల్ ప్లేయర్ అవార్డు కింద బ్యాంకాక్ ట్రిప్పు బంకర్ బస్టర్స్ ప్లేయర్ ఎంకే రాజు గెలుచుకున్నారు. ఛాంపియన్ గా నిలిచిన బంకర్ బస్టర్స్ కు ట్రోఫీతో పాటు రూ.8 లక్షలు, రన్నరప్ టీమ్ ట్యుటోరూట్ ట్రోఫీతో పాటు రూ.4 లక్షలు నగదు బహుమతి లభించింది. విజేతలకు టీ గోల్ఫ్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్ఆర్ఎన్ రెడ్డి, బౌల్డర్ హిల్స్ సీఎఫ్ఓ మధుసూదన్‌రావు ట్రోఫీలు అందజేశారు. గత కొన్నేళ్ళుగా హైదరాబాద్ లో గోల్ఫ్ క్రీడను ప్రమోట్ చేసేందుకు తరచుగా టోర్నీలు నిర్వహిస్తున్నామని, ఔత్సాహిక గోల్ఫర్లకు సైతం తమ ఫౌండేషన్ అండగా ఉంటోందని టీ గోల్ఫ్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్ఆర్ఎన్ రెడ్డి చెప్పారు.

పదవీ విరమణ సత్కారం



పదవీ విరమణ చేసిన వారితో సీపీ అవినాష్ మహంతి

రాయదుర్గం: సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో పదవీ విరమణ చేసిన వారిని సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి ఘనంగా సత్కరించారు. శనివారం గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లో వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారికి సీపీ మాట్లాడుతూ ఉద్యోగులకు పదవీ విరమణ తప్పదన్నారు. రిటైరైన తర్వాత సమాజ సేవలో భాగస్వాములవ్వాలన్నారు. పదవీ విరమణ చేసిన వారిలో రాయదుర్గం పీఎస్‌లోని ఎస్ఐపి మహ్మద్ యూసుఫ్, చందానగర్ పీఎస్ ఎస్ఐపీ ఎం కృష్ణయ్య, బాలానగర్ పీఎస్ ఏఎస్ఐపీ ఆంజనేయులు ఉన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యాలయం డీసీపీ సంజీవ్, అడ్మిన్ ఏడీసీపీ రవిచందన్‌రెడ్డి, హెడ్‌క్వార్టర్స్ ఏడీసీపీ షమీర్, ఎస్టేట్ ఆఫీసర్ ఆర్ఐ హిమకర్, ఏఎస్ఐ కోఆపరేటివ్ సొసైటీ ఇన్‌చార్జ్ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంట్లో ఇంకుడుగుంత ఉండాలి



నీటి పొదుపుపై అలకాపూర్ టౌన్‌షిప్‌లో అవగాహన కల్పిస్తున్న నందీశ్వర్‌గౌడ్

మణికొండ: ప్రపంచ వ్యాప్తంగా తాగునీటి వనరులు తగ్గిపోతుండడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, నీటిని పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉందని స్పీడ్ ఎన్‌జీఓ అధ్యక్షుడు నందీశ్వర్‌గౌడ్ అన్నారు. శనివారం మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని అలకాపూర్ టౌన్‌షిప్‌లోని నేతాజీ పార్క్, మహాత్మాగాంధీ పార్కులలో ప్రపంచ నీటి దినోత్సవంలో భాగంగా నీటి పొదుపు, ఇంకుడు గుంతల ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరాలలో వేసవి కాలం నీటి కొరత ఏర్పడుతుందన్నారు. అవసరానికి మించి నీటి వినియోగం, భూగర్భ జలాలు తగ్గిపోవటం, ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోకపోవడం కారణం అని అన్నారు. నీటిని భూమిలోకి ఇంకించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రతి ఇంట్లో నీటి సంపు లానే ఇంకుడుగుంత ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మార్నింగ్ వాకర్స్, మహిళలు పాల్గొన్నారు.